


తిరుమల అంటే సెంటిమెంట్ : హీరో నాని



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చిన్నతనం నుండి తిరుమల శ్రీవారంటే తనకు సెంటిమెంటని, స్వామి వారిని దర్శించుకుంటే చాల ప్రశాంతంగా ఉంటూ కార్యకలాపాలు సాగుతాయని న్యాచురల్ స్టార్ నాని తెలిపారు. తిరుపతి రినెస్ట్ హోటల్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 7న 'హాయ్ నాన్న' సినిమా విడుదల సందర్భంగా స్వామి వారి ఆశీస్సులు తీసుకుని, ఇప్పుడు ప్రజల ఆశీర్వాదం కోసం వచ్చానన్నారు. హాయ్ నాన్న చిత్రంలో సెంటిమెంట్, ఎమోషనల్, ప్రేమ అన్ని అంశాలతో కుటుంబం మొత్తం కలిసి చూసే సినిమా అన్నారు. తొలిసారి వైర్ ఎంటర్టైన్మెంట్ ఈ చిత్రాన్ని నిర్మించారని, దర్శకుడు శౌర్యవ్ చాలా బాగా చిత్రీకరించారన్నారు. ఇందులో ఒక పాటను హీరో విక్రమ్ కుమారుడు పాడారన్నారు. మల్టీస్టారర్ సినిమాలకు మంచి కథ దొరికితే తప్పకుండా చేస్తానన్నారు. శంకరాభరణం, సాగరసంగమం లాంటి సినిమాలు చేసే అవకాశం వస్తే అంత కంటే అదృష్టం ఉండదన్నారు.


నాయుడుపేటలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

రెవెన్యూ డివిజన్లు లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్లు

శ్రీకాళహస్తి.... 9704161120
సూళ్లూరుపేట. 9490739223
గూడూరు .. 08624 252807
తిరుపతి .. 9491077012


నాగలాపురం మండలంలో గర్భిణీని తాళ్లసాయంతో వాగు దాటిస్తున్న స్థానికులు


తడ మండలంలో ఉప్పెనలా వాగులు

ఇదేం 'తుపాను' బాబోయ్..!

- కుండపోతగా వర్ష భయానకం
- పలుచోట్ల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- గ్రామాలకు రాకపోకలు బంద్, అంధకారం
- వేలాది ఎకరాల్లో వరి పంట నీట మునక
- నాగలాపురంలో 'గర్భిణీ'కి పురిటి కష్టాలు
- ఘాట్‌లో రాత్రి 8 వరకే వాహనాలు అనుమతి
- తిరుమల శ్రీవారిమెట్టు మార్గం మూసివేత
- నేడూ సెలవు ప్రకటించిన విద్యాశాఖ

మూడు రోజులుగా మిచౌంగ్ తుపాను ఎఫెక్ట్ జిల్లాను అతలాకుతలం చేస్తోంది... ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. సోమవారం కుండపోత వర్షం ఆగకుండా కురుస్తూనే ఉంది. పలుచోట్ల వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. నాగలాపురంలో నిండు గర్భిణీకి ఉన్నట్టుండి పురిటినొప్పులు రావడంతో చేతులతో పట్టుకుని తాడు సాయంతో వాగు దాటించారు. తిరుమల ఘాట్‌లో పొగమంచు వాహనదారులకు ఇబ్బందిగా మారడంతో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకే వాహనాలను అనుమతిస్తున్నట్లు టిటిడి ప్రకటించింది.భక్తుల భద్రత రీత్యా శ్రీవారి మెట్టు మార్గాన్ని మూసేశారు. మంగళవారమూ తుపాను ప్రభావం ఉండడంతో విద్యాశాఖ సెలవు ప్రకటించింది. యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టేందుకు తిరుపతి జిల్లాకు 2 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, శ్రీకాళహస్తి, యంత్రాంగం

తిరుపతి జిల్లాకు రూ.2 కోట్ల నిధులు : సిఎం

ప్రజాశక్తి - అమరావతి

తుపాను నేపథ్యంలో అత్యవసర ఖర్చుల కోసం తిరుపతి జిల్లాకు రెండు కోట్ల నిధులను విడుదల చేసినట్లు సిఎం జగన్మోహన్‌రెడ్డి వెల్లడించారు. తిరుపతి జిల్లా ప్రత్యేకాధికారిగా శ్యామలరావును నియమించారు. పునరావాస కేంద్రాల నుంచి ఇంటికి వెళ్లేటపుడు కుటుంబానికి రూ.2,500 ఇవ్వాలని సూచించారు. వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టం అంచనా వేయాలని ఆదేశించారు. తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.బాపట్ల సమీపంలో తుపాను తీరం దాటే అవకాశం ఉందని, అపుడు గంటకు 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తయని ఐఎండి అధికారులు చెబుతున్నారన్నారు. రెండు మూడు రోజుల్లో పరిస్థితులు కుదుటపడతాయని చెప్పారు. ఇళ్లల్లోకి నీళ్లు వచ్చిన వారికి 25 కేజీల బియ్యం, కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు కిలో చొప్పున అందించాలన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు తక్షణమే 10వేలివ్వాలన్నారు.

తుపాను బాధితులను ఆదుకోండి :సిపిఎం


పుత్తూరులో..


రేణిగుంటలో..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మీచౌంగ్ దుపాను తీవ్రరూపం దాల్చడంతో తీర ప్రాంతాల్లో విద్యుత్ సదుపాయం లేక, తాగునీరు, భోజన అవసరాలు తీర్చని పరిస్థితి నెలకొందని, అధికారులు స్పందించి నిర్వాసితులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను యుద్ధప్రాతిపదికన సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన రెండు కోట్ల సాయం ఏమాత్రం సరిపోదని, మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందించాలన్నారు. సిపిఎం కార్యకర్తలు అన్ని ప్రాంతాల్లో పర్యటించి సహాయ చర్యల్లో పాల్గొనాలన్నారు.

పుత్తూరులో.. 27వ వార్డు జలమయం కావడంతో ఇళ్లల్లోకి నీళ్లు వచ్చిన బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి నిత్యావసర సరుకులు అందించాలని సిపిఎం జిల్లా నాయకులు ఆర్.వెంకటేష్ డిమాండ్ చేశారు. లోతట్టు ప్రాంతాలని సోమవారం సందర్శించారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గూడూరు రూరల్ : చెన్నూరు బీసీ కాలనీకి పోయే దారిలో ఆదివారం రాత్రి కరెంట్ స్తంభాలు విరిగి రోడ్డుకి అడ్డదిడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఎదురయ్యింది. గ్రామంలో అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సిపిఎం నాయకులు ముకుంద డిమాండ్‌చేశారు.

రేణిగుంట : కరకంబాడి పంచాయతీ తారకరామా నగర్ సిపిఎం ఆధ్వర్యంలో పేదల ఇళ్లను సందర్శించారు. ఇక్కడి ప్రజలందరూ ఎక్కువగా కూలి జీవనాధారంగా బతుకు జీవనం గడుపుతున్నారని, వారం రోజులుగా వర్షం కారణంగా పనులు లేవని వాపోయారు. ప్రతి ఇంటికి పదివేల రూపాయల ఆర్థిక సాయం, 14 రకాల నిత్యావసర వస్తువులు ఇవ్వాలని అభివృద్ధి సంఘం కార్యదర్శి రాజశేఖర్, సిపిఎం కార్యదర్శి సత్యశ్రీ, సుజాతమ్మ, కుమారి డిమాండ్ చేశారు.

తిరుమలలో నిండుకున్న జలాశయాలు

తిరుమల : తిరుమలలో ఐదు జలాశయాలు పూర్తిస్థాయి నీటి నిల్వలతో ఉన్నాయి. గోగర్భం డ్యాం పూర్తిస్థాయిలో నిండడంతో గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేశారు.

డ్యాం	నీటిమట్టం(మీ)	ప్రస్తుతం (మీ)
గోగర్భం	2894	2887
పాపవినాశనం	697.14	693.60
ఆకాశగంగ	865	859.80
కుమారధార	898.24	896.20
పసుపుధార	898.28	895.90



నేలకొరిగిన బొప్పాయి పంట

ఏర్పేడు: మండలంలోని ఇసుక తాగేలి గ్రామపంచాయతీలో గల గోపాలపురం గ్రామంలో మేకలతూరు చంగా రెడ్డికి చెందిన రెండు ఎకరాల బొప్పాయి పంట తుఫాను దాటికి నేలకు ఒరిగి మూడు లక్షల పైగా నష్టం వాటిల్లింది. నష్టం పట్ల రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్సీ ఆర్థిక సాయం



ఏర్పేడు : చిందేపల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీ నందు తుఫాన్ కారణంగా గోడ పడిపోయి ఐదు సంవత్సరాల పిల్లవాడు మరణించాడు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ఐదువేల రూపాయల ఆర్థిక సాయాన్ని తల్లిదండ్రులు సుబ్బమ్మ, శ్రీనులకు అందించారు. వైసిపి నాయకులు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోటార్లతో ఇళ్లల్లో నీరు తొలగింపు



శ్రీకాళహస్తి రూరల్ : చెర్లోపల్లి హరిజనవాడ కాలనీలో 70 కుటుంబాలు ఉన్నాయి. ఈ కాలనీ నాయుడుపేట – పూతలపట్టు జాతీయ రహదారి పక్కనే ఉంది. రహదారి ఎత్తులో ఉండడంతో ఇళ్లల్లోకి వర్షపునీరు చేరింది. కొంతమంది ఇళ్లల్లోకి వచ్చిన నీటిని మోటార్ల సాయంతో బయటకు పంపించే ప్రయత్నం చేశారు. అధికారులు స్పందించి లోతట్టు ప్రాంతాన్ని మిట్ట ప్రాంతంగా చేసి నూతన గృహాలు నిర్మించి ఇవ్వాలని కాలనీవాసులు కోరుతున్నారు.

షెడ్డుకూలి దూడలు మృతి

రేకుల షెడ్డు కూలి నాలుగు దూడలు మృతి చెందిన సంఘటన మండలంలోని పిగిలాం గ్రామంలో చోటుచేసుకుంది. భాదితుడు వెలుగులేటి రామ కృష్ణయ్య నాయుడు కథనం మేరకు సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న గాలులతో గేదెల కోసం తమ ఇంటి ముందు రేకుల షెడ్డులో నాలుగు దూడలు కట్టేశారు. ఈ గాలులకు రేకులషెడ్డు కూలి దూడలు మృతి చెందాయి. పాడిపై జీవనం సాగిచ్చే తమకు జీవనాధారం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



కలెక్టర్ ముందుగా హెచ్చరించినా...

గర్భిణీని చేతులపై మోస్తూ వాగు దాటించిన గ్రామస్తులు


ప్రజాశక్తి -నాగలాపురం



తిరుపతి జిల్లా నాగలాపురం మండలానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని కొట్టకాడు గ్రామంలో ప్రతిభ అనే యువతికి పురిటినొప్పులు వచ్చాయి. అయితే తీవ్ర వర్ష ప్రభావంతో ఎక్కడికక్కడ దారులు మూసుకుపోయాయి. దీంతో గ్రామస్థులు, కుటుంబీకులు ఆమెను చేతులతో మోసుకుని తాళ్ల సాయంతో వాగుని దాటించిన హదయవిదారక ఘటన సోమవారం చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితమే స్వయానా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అధికారులను అప్రమత్తం చేస్తూ పది రోజుల్లో డెలివరీ అయ్యే గర్భిణీలను దగ్గరలోని ఆస్పత్రులకు చేర్చాలని ఆదేశాలు జారీ చేసినా స్థానిక అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి.

కుంభవర్షం కురిసిందంటే కొట్టకాడు గ్రామానికి రాకపోకలు 'బంద్' అవుతాయి.. గత మూడు రోజులుగా కురుస్తున్న తుపాను ప్రభావంతో కొట్టకాడు గ్రామానికి వెళ్లే వాగు పొంగిపొర్లుతోంది.. అయితే అదే గ్రామంలోని ప్రతిభ (21)కు ఉన్నట్టుండి పురిటినొప్పులు రావడంతో భర్త వెంకటేష్ (24)కు దిక్కుతోచలేదు. గ్రామస్తుల సాయంతో 108కు ఫోన్‌చేసినా స్పందన లేకపోవడంతో వాగు వరకూ ఆటోలో గర్భిణీని తీసుకొచ్చారు. గ్రామస్తులు చుట్టూ ఆమెకు రక్షణగా ఉండి చేతుల సాయంతో గర్భిణీని మోస్తూ తాళ్ల సాయంతో వాగును దాటించారు. అక్కడనుంచి మరో ఆటోలో నాగలాపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే నొప్పులు వచ్చాయని, డెలివరీకి ఇంకా రెండు రోజులు సమయం ఉందని వైద్యులు తెలిపారు.

పునరావాస కేంద్రంలో ఆకలి కేకలు



బాలాయపల్లి : మండలంలోని అంబలపూడి గ్రామ గిరిజనులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో గిరిజనులు ఆకలితో అలమటించారు. చేపలను వేటాడి జీవించే గిరిజనులను రెవెన్యూ అధికారులు ఆదివారం సాయంత్రం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయడం మరిచారు. పాఠశాలలో దాదాపు 30 మంది చిన్నారులు, వద్ధులు ఆకలికి తట్టుకోలేక గజగజ వణుకుతూ కనిపించారు.

మండల ప్రజలు భయపడవద్దని, తాను ఉన్నానని మండల వైసిపి అధ్యక్షులు జయంపు సహకార సంఘం అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డి అన్నారు. ముంపు ప్రాంతాలను సోమవారం సందర్శించారు. కలుజుకు అడ్డంగా ఉన్న తాటిమానులను తొలగించారు. ఆయన వెంట గున్నంరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

తూర్పు మండలాలు అతలాకుతలం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'మిచౌంగ్' తుపాను తిరుపతి జిల్లాను వణికిస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయు గుండం ఆదివారం అర్ధరాత్రికి తీవ్ర తుఫాన్‌గా మారింది. దీంతో సోమవారం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఈ నెల ఐదో తేదీ ఉదయానికి ఒంగోలు– మచిలీపట్నం మధ్య చీరాల లేదా బాపట్లకు సమీపంలో తీరం దాటుతుందని అంచనా వేస్తున్న నేపథ్యంలో సముద్ర తీరానికి సమీపంలో ఉన్న జిల్లాలు తూర్పు మండలాల్లో భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. వేల ఎకరాల్లో వరి పంటలు నీట మునిగాయి. కాళంగి రిజర్వాయర్, అరణియార్ రిజర్వాయర్లకు ప్రమాద స్థాయిని దాటి నీరు చేరడంతో నీటిని బయటకు వదులుతున్నారు. కుండ పోత వర్షానికి ఆధ్యాత్మిక పట్టణం శ్రీకాళహస్తిలో చాలా ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. స్వర్ణముఖి నది ఉగ్రరూపం దాల్చడంతో తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి నదీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించి ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. మిచౌంగ్ ముప్పు మరో మూడు రోజులు పొంచి ఉన్న నేపథ్యంలో బిక్కుబిక్కుమంటూ కాలం వెలదీస్తున్నారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాలు జలమయమయం కావడంతో వరద నీరు, చలితో నిద్రలేని రాత్రులు గడుపుతున్న ప్రజానీకం మిచౌంగ్ ముప్పు ఇంకా తొలగపోలేదన్న వేదనలో అల్లాడిపోతున్నారు.

అరణియార్ గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - పిచ్చాటూరు

తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం అరణియార్ ప్రాజెక్టులో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి ప్రాజెక్టులోకి నీరు చేరడంతో ఇరిగేషన్ అధికారులు ఈఈ మదన్ గోపాల్ రాజు ఆధ్వర్యంలో సోమవారము సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేత నాలుగు గేట్లను రెండు అడుగుల నీటిమట్టాన్ని కింద భాగమునకు విడుదల చేశారు. మండల అధ్యక్షులు చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో గేట్లు ఎదురుగా ఉన్న పిచ్చాటూరు - శ్రీకాళహస్తి కాజ్‌వే పై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అప్రమత్తమైన ఎస్ఐ వెంకటేశ్వర్లు కాజ్‌వేకు రెండు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేసి నదిని దాటకుండా రాకపోకలను నిలిపివేశారు.

తలకోన జలపాతం ఉగ్రరూపం


ప్రజాశక్తి - యర్రావారిపాలెం తలకోన అటవీ ప్రాంతంలో గల జలపాతం గత మూడు రోజులుగా తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షానికి ఉగ్రరూపం దాల్చింది. దీంతో జలపాతం దగ్గరికి వెళ్లడానికి పర్యాటకులకు ఎవరికి అనుమతి లేకుండా నీతి ఉధతి తగ్గేంతవరకు ఆలయ ప్రాంగణంలో గల చెక్ పోస్టును ఎస్సై ఈశ్వరయ్య తన సిబ్బందితో కలిసి మూసివేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్తీక మాసం పురస్కరించుకొని భక్తులకు ఆలయం వరకే అనుమతి ఇచ్చారు.


అరణియార్ ప్రాజెక్టు వద్ద


తలకోనలో..

30మీటర్ల ముందుకు తూపిలిపాలెం సముద్రం

ప్రజాశక్తి - వాకాడు



మండలంలోని తూపిలి పాలెం సముద్రం తీరం దగ్గర సుమారు 30 మీటర్ల వరకు సముద్రం ముందుకు వచ్చిందని ఆ గ్రామ ప్రజలు తెలిపారు. ముఖ్యంగా తీరప్రాంతాలు అయినటువంటి పూడి, రాయదొరువు, మూల పడవ, నిడుగుర్తి, రావిగుంటపాలెం, శ్రీనివాసపురం, గాకివాకం, మన పాలెం, వాడపాలెం, వైట్ కుప్పం, చిన్న తోట, పూడి కుప్పం, మాధవపురం, రాయదొరువు, నవ పేట, తానకట్ట ఈ ప్రాంతాలకు మామూలు రోజుల్లోనే రోడ్డు సౌకర్యం అంతంత మాత్రమే. తుఫాన్ కారణంగా రాకపోకలు స్తంభించాయి. ఈ ప్రాంతంలో ఎక్కడ తుఫాను రక్షిత భవనాలు లేవని, 9 కిలోమీటర్లు దూరంలో ఉన్న మొన్నపాలెం తుఫాన్ రక్షిత భవనానికి వెళ్లాల్సివస్తుందని, రోడ్డు సరిగ్గా లేక బైకుల్లో పోయే వెసులుబాటు లేదని ప్రజలు వాపోతున్నారు.

శ్రీసిటీ కార్మికులు విధులకు వెళ్లొద్దు : ఎస్ఐ

బిఎన్‌కండ్రిగ : వరదయ్యపాళెం కారణమెట్ట వద్ద కాల్వపై వరదప్రవాహ నీటి ఉధృతికి రాకపోకలు స్తంభించాయి. శ్రీసిటీ, ఇతర కంపెనీల కార్మికులు ఇళ్లకే పరిమితం కావాలని, వాహన, ఇతన ప్రయాణాలను రద్దు చేసుకోవాలని ఎస్ఐ వెంకట నరసింహం విజ్ఞప్తి చేశారు. వాహన రాకపోకలు నిషేధించినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాలకు, తీగలకు దూరంగా ఉండాలని, పూరి గుడిసెల్లో ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు.

ప్రత్యేక అధికారిగా శ్యామలరావు

తిరుపతి టౌన్ : మిచౌంగ్ తుపాన్ పొంచి ఉన్న నేపథ్యంలో ప్రభావిత జిల్లాలకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. తిరుపతి జిల్లాకు శ్యామలరావును రాష్ట్ర ప్రభుత్వంనియమించింది .నెల్లూరు–హరికిరణ్, బాపట్ల–కాటంనేనిభాస్కర్, అంబేడ్కర్ కోనసీమజిల్లా జయలక్ష్మి, తూ.గో–వివేక్ యాదవ్, ప.గో–కన్న బాబు, కాకినాడ–యువరాజ్, ప్రకాశం– ప్రద్యుమ్నలను నియమించారు.

రాత్రి 8 వరకే ఘాట్‌లో...

తిరుమల : తుపాను వల్ల కురుస్తున్న వర్షాల కారణంగా రెండు ఘాట్‌రోడ్లలో పొగమంచు దట్టంగా కమ్ముకుంది. దీనివల్ల వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతుండడంతో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 వరకే వాహనాలకు అనుమతి ఇచ్చారు. తిరుమల జెఇఒ వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఘాట్‌రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ జగదీశ్వర్‌రెడ్డి, విజిఒ నందకిషోర్, ఫారెస్టు అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

15 విమాన సర్వీసులు రద్దు

రేణిగుంట : తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి తుఫాను ఎఫెక్ట్ వల్ల సోమవారం 15 విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా, స్టార్ ఎయిర్‌వేస్‌కు చెందిన పలు విమానాలు రద్దయినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. రన్‌వే నీళ్లతో నిండిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఉన్నట్టుండి ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విమానాలను రద్దు చేయడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గాలివాన బీభత్సం

సూళ్లూరుపేట : గాలుల బీభత్సంతో భయానక వాతావరణం నెలకొంది. గాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. ఆదివారం రాత్రి నుంచి కొన్ని గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. కెవిబిపురం కాళంగి నది పది గేట్లు ఎత్తివేయడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల వారిని ఎంఎల్‌ఎ కిలివేటి సంజీవయ్య ఆదేశాల మేరకు ఆర్డీవో చంద్రముని, ఎంఆర్‌ఒ రవికుమార్‌లు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షం

రామచంద్రాపురం : లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది. రోడ్లు స్విమ్మింగ్‌పూల్‌లను తలపిస్తున్నాయి. మండల కేంద్రంలో భారీ వటవృక్షం తిరుపతి పచ్చికాపల్లం ప్రధాన రహదారికి అడ్డంగా నేలకొరిగింది. ఎస్ఐ గిరిబాబు జేసీబీ సాయంతో తొలగించారు.ప్రొహిబిషన్ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్, ఆర్‌సి పురం తహశీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు గ్రామాల్లో పరిశీలించారు.



రైతులకు భోజనాలు ఏర్పాట్లు

ఏర్పేడు: గత రెండు రోజులుగా పడుతున్న భారీ వర్షాలు కారణంగా ఏర్పేడు మండలంలోని గోవిందవరం ఎస్టీ కాలనీ, పాగాలి ఎస్టి కాలనీ, వెంకటాపాలెం ఎస్టి కాలనీలో నివసిస్తున్న గ్రామాల్లో ఉన్న రైతులను, గ్రామస్తులను పరామర్శించి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు భోజన ఏర్పాట్లను చేసిన పవిత్ర రెడ్డి పర్యవేక్షించారు. ఎక్కడైనా వాగుల్లో వంకల్లో ఇరుక్కుంటే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఏర్పేడు మండల వైసిపి ఇన్‌ఛార్జి గున్నేరు కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణిడ్యాం పరిశీలన

చంద్రగిరి : తిరుపతి, తిరుమలకు తాగునీరు అందిస్తున్న మండలంలోని రంగంపేట వద్ద ఉన్న కల్యాణిడ్యాంను ఎంపిపి హేమేంద్రకుమార్‌రెడ్డి, చంద్రగిరి వైసిపి ఇన్‌ఛార్జి మధుసూదన్‌రెడ్డి, తహశీల్దార్ శిరీష, ఎంపిడిఒ బాలాజీనాయక్ పరిశీలించారు. కళాశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులు ఈతకు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

స్వర్ణముఖి తీర ప్రాంత ప్రజల అప్రమత్తం : ఎస్‌పి

తిరుపతి టౌన్ : స్వర్ణముఖి నది తీర ప్రాంత ప్రజలను ఎస్‌పి పరమేశ్వరరెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. సిబ్బందితో సోమవారం సుడిగాలిపర్యటన చేశారు. వరద ముంపు కలగబోయే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు సురక్షితంగా ముందుగా చేరుకోవాలన్నారు. ఈ పర్యటనలో అదనపు ఎస్పీ కులశేఖర్ శాంతి భద్రత డిఎస్పిలు గిరిధర ఎస్పి, భవ్య కిషోర్ రేణిగుంట, భీమారావు శ్రీకాళహస్తి పాల్గొన్నారు.



భక్తులకు సూచనలు ఇస్తున్న టిటిడి అధికారులు


శ్రీవారిమెట్టులో రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీవారి మెట్టు మార్గంలో మిచౌంగ్ తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు భక్తుల భద్రత దృష్ట్యా టిటిడి రాకపోకలను నిలిపివేసింది. ఈ మేరకు భద్రత విభాగం అధికారులు భక్తులను, వాహనాలను శ్రీనివాసమంగాపురం టిటిడి కళ్యాణ కట్ట వద్దనే ఆపేశారు.

జీవనానికి నేల, నీరే ఆధారం

నేడు ప్రపంచ నేలల దినం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: భూగోళం మీద జీవరాశి జీవనానికి భూమే ప్రాథమిక ఆధారం, మనుషులు, జంతువులు, మొక్కలు, క్రిమి కీటకాలు, సూక్ష్మ జీవుల మనుగడకు మట్టే మూలాధారం.. ఈ జీవరాశికి అవసరమైన ఆహారం, ఆవాసం, ఆధారం అంతా భూమే సమకూర్చుతుందని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ మెరుగు భాస్కరయ్య 'ప్రజాశక్తి'కి తెలిపారు. మంగళవారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో, శాస్త్ర సాంకేతికంగా జరుగుతున్న అభివృద్ధి కారణంగా, కాలుష్య కోరల్లో తల్లిలాంటి భూమి తల్లడిల్లు తోందన్నారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు, ఆధునిక వ్యవసాయంలో వాడే రసాయనాలు నేలల్లోని జీవాన్ని చంపేస్తున్నాయి. ఫలితంగా భూములు నిర్జీవంగా తయారవుతున్నాయని, అదుపులేని కాలుష్యాల కారణంగా, వాతావరణంలో పెను మార్పులు వస్తున్నా యన్నారు. వాతావరణం వేడెక్కడం, సకాలంలో వర్షాలు పడకపోవడం, కరువు పరిస్థితులు, భూగర్భజలాలు అడుగంటడం వాతావరణ మార్పుల కారణంగానే జరుగుతోందని తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల భూమిపై జీవరాశి మనుగడ కష్టతరమవుతోందని, ఈ వాస్తవాలను గమనించిన అంతర్జాతీయ సమాజం, భూమిపై జీవరాశి జీవనానికి భూమి అవసరం, ప్రాముఖ్యత, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి, ప్రతి సంవత్సరం డిసెంబరు 5వ తేదీ ప్రపంచ నేలల దినంగా ప్రకటించి దన్నారు. ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక నినాదంతో, నేలల దినాన్ని ప్రపంచమంతా జరుపుకుంటారు. 2023 సంవత్సరం 'జీవనానికి నేల..నీరే ఆధారం' అదే నినాదంతో ప్రపంచ నేలల దినాన్ని జరుపు కొంటున్నా మన్నారు. జగతిలోని జీవరాశికి, నేల, నీటితో విడదీయలేని సంబంధం ఉందని తెలిపారు. 95 శాతకు మించి, జీవరాశికి ఆహార ఉత్పత్తి, నేల, నీటిపైనే ఆధారపడి ఉందని, అందుకే నేల ఆరోగ్యం నీటి అందుబాటు అనేవి జీవరాశి జీవనానికి ప్రాథమిక అవసరాలు అన్నారు. నేల, నీటి సంరక్షణ 2023 సంవత్సరం ప్రపంచ నేలల దినం నినాదంగా ఎంచుకున్నామని సాగు భూములకు రసాయ నాల వాడకం తగ్గించడం, సేంద్రియ ఎరువుల వాడక పెంచడం, భూములను తక్కువ దున్నడం, పంటల వైవిధ్యాన్ని పెంచడం, వంట మార్పిడి, మిశ్రమ పంటల సాగు, సంప్రదాయ, దేశవాళీ పంట రకాల పెంపకం, నేలకోత నివారణ చర్యలు, నేలను కప్పి ఉంచడం వంటి చర్యలు నేల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయన్నారు. వర్షాలే నీటికి ప్రధాన ఆధారం అని, వర్షపు నీటిని పరిరక్షించి, భూగర్భ జలాలను పెంచుకోవడం, జీవరాశి మనుగడకు చాల అవసరమని పేర్కొన్నారు. ఇందుకోసం, ఎక్కడ పడిన వర్షపు నీరు అక్కడే ఇంకేటట్లు చేయాలని, వాలుకు అడ్డంగా కాలువలు, కందకాలు తీసి, నీరు వృథా పోకుండా వాడాలని, నీటి గుంటలు, చెక్ డ్యాంలు ఏర్పాటు ద్వారా భూగర్భజలాలను పెంచుకోవాలన్నారు. బీడు భూములలో చెట్లు పెంపకం, సామాజిక అడువుల పెంపకం చేపట్టి నీటిని పరిరక్షించాలని సూచించారు. నేల, నీటి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా చేపడితే మానవ మనుగడ మంచిగా ఉంటుందన్నారు.



అందరూ ఇళ్లలోనే ఉండాలి: ఎస్ఐ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: తుపాన్ ముప్పు పొంచి వున్న కారణంగా ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు అందరూ ఇళ్లలోనే వుండాలని బివికెండ్రిగ ఎస్ఐ వెంకట నరసింహ హెచ్చరించారు. తుపాన్ ఉగ్రరూపం దాల్చడంతో పల్లమాల, కాటూరు, బుచ్చి నాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం, కారంమెట్ట వద్ద కాలువలపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలు స్తంభించాయని, ప్రజలు, ఉద్యోగులు, శ్రీసిటీ, ఇతర కంపెనీల కార్మికులు ఇళ్లకే పరిమితం కావాలని, వాహన, ఇతర ప్రయాణాలు రద్దు చేసు కోవాలని ఎస్ఐ సూచించారు. వాహనాల రాకపోకలు, ప్రయాణాలు పై నిషేధం విధించినట్లు ఆయన తెలిపారు. విద్యుత్ స్తంభాలు తీగలకు దూరంగా ఉండాలని, పూరి గుడిసెలలో ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. ఏదైనా అత్యవసర పరి స్థితులు, ప్రమాదకర ఘటనలపై 919440900723 ఫోను నెంబరుకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.



కారంమెట్ట కాలువ వద్ద పరిస్థితిని పర్యవేక్షిస్తున్న పోలీసులు

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలంలోని గాజులమండ్యం లోని శ్రీకామాక్షి సమేత మూల స్థానేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ ధర్మకర్తలు అన్నాభిషేక మహోత్సవం నిర్వహించారు. కామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా అన్నాభిషేకం ఆలూరు దక్షిణామూర్తి, దండపాణి అన్నాభిషేకం ఆలయ ధర్మకర్త జువ్వల ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పి అభిషేకం చేసి దర్శనం సౌకర్యం కల్పించారు. స్వామి అమ్మవార్లకు 108 కలశాలతో జలాభిషేకం చేశారు. అన్న ప్రసాదం వితరణ చేశారు. నంది వాహనంలో పార్వతి పరమేశ్వరులు పల్లకి సేవలో ఆలయ ప్రదక్షిణం నిర్వహించారు. అన్న ప్రసాద వితరణలో ఎంపీపీ కంపాటి హరిప్రసాద్ రెడ్డి, గాజుల మండ్యం ప్రముఖులు జువ్వల ధనుంజయ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు జువ్వల దయాకర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరంలోని చేపట్టబోవు అభివృద్ధి పనులపై చర్చించి, తిరుపతి నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన, కమిషనర్ అజెండా అంశాలను ప్రవేశపెట్టగా, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు నరసింహాచారి, గణేష్, ఉమాఅజయ్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు పాల్గొని అజెండా అంశాలపై చర్చించి ఆమోదించారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ గతంలో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయం అయ్యేవని, నేడు రికార్డు స్థాయిలో 125 ఎం.ఎం వర్షం కురిసినా, ప్రస్తుత నగర పాలక సంస్థ ముందు చూపుతో మెరుగైన డ్రైనేజ్ వ్యవస్థతో చుక్క నీరు కూడా నిలవనీయకుండా చేయడం అభినంద నీయమన్నారు. తిరుపతి నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్ల సమిష్టి కృషితోనే అద్భుత ఫలితాలని సాధించా మన్నారు. స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదించిన ముఖ్య అంశాల్లో కళ్యాణి డ్యాం వద్ద ఉన్న రెండు ఫిల్టరేషన్ ప్లాంట్లు, అలిపిరి వద్ద ఫిల్టరేషన్ ప్లాంట్, టౌన్ సర్వీస్ రిజర్వాయర్, బిపి వద్ద నీటిని శుద్ధి చేసేందుకు, అదేవిధంగా మంగళం వద్ద ఫిల్టరేషన్ ప్లాంట్లలో, త్వరలో ప్రారంభించబోవు ఫిల్టరేషన్ ప్లాంట్ నకు, తెలుగుగంగ నీటిని శుద్ధి చేయుటకు ఉపయోగించు వేపొరైజ్ లిక్విడ్ క్లోరిన్ గ్యాస్, ఫెర్రిక్ ఆలమ్, లిక్విడ్ క్లోరిన్ ఒక సంవత్సరానికి కొనుగోలు చేసేందుకు 50 లక్షలు, 49.95 లక్షలు కేటాయిస్తూ ఆమోదించారు. వీటితో పాటు మరి కొన్ని పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ రాధిక, రెవెన్యూ అధికారులు కె.ఎల్.వర్మ పాల్గొన్నారు.

గుంతలు పూడ్చి ప్రాణాలు రక్షించండి

- రోడ్డుకు మరమ్మతులు చేయండి
- మంత్రులకు, కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి- నాయుడుపేట: తమ ఇంటికి వచ్చే రోడ్డు పూర్తిగా జలమయమై నీట మునిగి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని, బయటకొచ్చే పరిస్థితి కూడా కనిపించక నాలుగు రోజుల నుంచి కోర్టుకు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొందని ఏదైనా అత్యవసర పరిస్థితి నెలకొన్నా కారును కూడా బయటికి తీయ లేని పరిస్థితి నెలకొం దని, ఇకనైనా తమ రోడ్డుకి మరమ్మతులు చేయాలని నాయుడు పేట సీనియర్ న్యాయ వాది, బార్ అసోసియే షన్ గౌరవ అధ్యక్షులు వేందోటి పార్థ సారథిరెడ్డి కోరారు. ఈ మేరకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి, తిరుపతి కలెక్టర్ వెంకటరమణా రెడ్డికి లేఖ రాశానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డుకి సుమారుగా 500 అడుగుల దూరంలో నిర్మించి ఉన్న తమ ఇంటి చుట్టూ పూర్తిగా వర్షపునీరు చేరి చెరువును తలపిస్తోందని, రహదారి గుంతలమయమై ప్రమాదాలకు నిలయంగా మారిందని వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. మందబయిలు, తాల్వాయిపాడు, జువ్వలపాళెం నుంచి పట్టణానికి వచ్చే ప్రజలకు నాయుడుపేట లోని అటువైపు పొలాలు ఉన్న రైతులకు ఈ రోడ్డు ఉపయోగకరమని, అత్యవసరం అని ఆయన పేర్కొన్నారు. మూడు నాలుగు రోజులుగా కుండపోతలా కురుస్తున్న వర్షానికి రోడ్లు, వీధులు అధ్వానంగా మారాయన్నారు. ఈ వర్ష తాకిడికి పూర్తిగా జలమయమై ఇంట్లోంచి కాలు బయటపెట్టలేని పరిస్థితి నెలకొందని, ఎంతటి అత్య వసర పరిస్థితి ముంచుకొచ్చిన సహా యం అందించే వారు సైతం రోడ్డు లేక అటు దిక్కు వెళ్లలేని పరిస్థి తులు నెలకొందన్నారు. ఎప్పటి నుంచో ఈ రోడ్డును నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ కి, సంబంధిత అధికారు లకు పలు మార్లు వినతి పత్రాలు ఇచ్చినా రోడ్డు ప్రయో జనం లేదని తెలిపారు. వెంటనే స్పందించాలని కోరారు.



గుంతలమయమైన రహదారి

రహదారిపై గుంతలు ప్రమాదాలకు నెలవు

వెంకటగిరి రూరల్ : తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలోని కైవల్య నది వంతెన కొత్త బ్రిడ్జి నుండి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో వెళ్లే దారి ద్విచక్ర వాహనదారులకు, ప్రమాదాలకు నిలయంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిన్న గుంతలు కాస్త పెద్దగుంతలై వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించటం లేదని, నిత్యం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి, పంచాయతీరాజ్, వైయస్సార్ క్రాంతి పథం కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు ఇబ్బందికరంగా మా రిందని పేర్కొం టు న్నారు. అధికారు లు గుర్తించి ప్రమా దాల నివార ణకు చర్యలు తీసు కోవాలని స్థానికు లు కోరుతున్నారు.



వెంకటగిరిలో

టిటిడి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి: టిటిడి ఆధ్వర్యంలో మొదటిసారి 63వ అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని సోమవారం తిరుపతిలోని పరిపాలన భవనంలో ఘనంగా నిర్వహించారు. విధుల్లో ఉత్తమ సేవలు అందించిన ప్రత్యేక ప్రతిభావంతులు, అంధులు, బధిరుల విభాగాల్లో మొత్తం తొమ్మిది మందికి టీటీడీ సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో స్నేహలత అవార్డులు ప్రదానం చేశారు. గత నెల 27న నిర్వ హించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి మహిళలు, పురుషుల విభాగాల్లో బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పలువురు ప్రత్యేక ప్రతిభావంతులైన ఉద్యో గులు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సహకరించిన టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి, ఈవో ఎవి ధర్మారెడ్డికి, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఇఇ మనోహరం, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు జె.భాస్కర్, రెడ్డెప్పరెడ్డి, సునీల్ కుమార్, రవి కుమార్, తులసి, టీటీడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

తిరుపతిలో ప్రతి వీధి లైట్ వెలగాల్సిందే: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని ప్రతి వీధి లైట్ వెలగాల్సిందేనని, అవసరమైన చోట్ల మరిన్ని వీధి లైట్లు ఏర్పాటు చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరణ స్పందన కార్యక్రమంలో కమిషనర్ అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పూలవానిగుంట మైత్రీ అపార్టుమెంట్ వద్ద వీధి లైట్లు వెలగడం లేదని, చీకట్లో పాములు, పురుగులు వస్తున్నాయనే ఫిర్యాదుపై కమిషనర్ స్పందించారు. నగరంలో ప్రతి వీధి లైట్ వెలగాల్సిందేనని, మరో సారి పిర్యాధులు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ అడ్మిన్లకు సూచనలు జారీ చేస్తూ తుపాను హెచ్చరికలపై జాగ్రత్తగా వుండాలని సమస్య కనిపిస్తే వెనువెంటనే తమకి తెలపాలన్నారు. ఈ సందర్భంగా అందిన ఫిర్యాదులన్నింటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, రెవెన్యూ అధికార్లు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రరెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, సూపరింటెండెంట్లు, డిఈలు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో జాతీయ సదస్సు



ప్రజాశక్తి - క్యాంపస్: ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్, తిరుపతి చాప్టర్, శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం సంయుక్తంగా 'ఉమెన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ సస్టైనబుల్ ఫ్యూచర్ ' అనే అంశంపై 4, 5 తేదీలలో రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తోంది. దీనికి సంబంధించి ఎస్పియంవివిలోని సావేరి సెమినార్ హాల్‌లో సోమవారం ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సెమినార్‌కు చీఫ్ ప్యాట్రన్ గా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి భారతి పాల్గొని సైన్స్ అండ్ టెక్నాలజీలో మహిళల పాత్ర గురించి ఆమె అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కా తిరుపతి చాప్టర్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.రామమూర్తి, ఇస్కా మాజీ జనరల్ ప్రసిడెంట్ డాక్టర్ విజయలక్ష్మి సక్సేనా, ప్రొఫెసర్ జి. గంగాధర్, బెంగళూరు చాప్టర్ కన్వీనర్ పాల్గొన్నారు. ప్రధాన వక్త ప్రొఫెసర్ డి నారాయణరావు, ఇస్కా మాజీ జనరల్ ప్రసిడెంట్ పర్యావరణం కోసం సుస్థిరత ప్రాముఖ్యతపై చర్చించారు. మహిళా అభ్యర్థుల నుంచి తమకు విశేష స్పందన లభించిందని సదస్సు కన్వీనర్ డాక్టర్ కె. పూర్ణచంద్రరావు తెలిపారు. తద్వారా మహిళలు సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారని తెలియడం హర్షదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతం వ్యాప్తికి అడ్వైజరీ బోర్డు సమావేశం



సంస్కృత వ్యాప్తిపై సమావేశం నిర్వహిస్తున్న అడ్వైజరీ బోర్డు సభ్యులు

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విద్యాలయం తిరుపతిలో డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో సంస్కృత భాషను దేశ విదేశాలలో వ్యాప్తికి హై కమిటీ అడ్వైజరీ బోర్డు మీటింగ్ విశ్వ విద్యాలయం సిడిఓఇ కార్యాల యం లో సోమవారం నిర్వ హించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ జిలాని, సెంట్రల్ సంస్కృత యూనివర్సిటీ, న్యూఢిల్లీ డిస్టెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రత్నమోహన్ విచ్చేశారు. సిడిఓఇ ద్వారా సంస్కృత భాష అభివృద్ధి ఎలా చేయాలో వివరించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సమావేశంలో విశ్వ విద్యాలయంలోని డిస్టెన్స్ అండ్ ఆన్లైను ఎడ్యుకేషన్ కేంద్రం ద్వారా ఏ విధంగా 'సంస్కృతాన్ని దేశ విదేశాలకు అందించాలి? దాని కోసం ఏమి చేయాలి?' అనే దానిపై విస్తృతంగా చర్చించి అందులో తీసుకున్న నిర్ణయాలను త్వరలోనే అమలు చేసి తద్వారా సంస్కృతాన్ని ప్రజలందరికీ దగ్గర చేయాలన్నారు. సిడిఓఇ డైరెక్టర్ ప్రొఫెసర్ రంగనాథన్ ఈ సమావేశం ఆవశ్యకతను, తీసుకున్న నిర్ణయాలను వివరించారు. తద్వారా భవిష్యత్తులో సంస్కృత భాషలో అనేక ఆన్‌లైను కోర్సులు, ఇతర కోర్సులను పరిచయం చేస్తూ సంస్కృతాన్ని ప్రజలకు మరింత దగ్గర చేయడానికి వీలవుతుందన్నారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రారు ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ , డీన్ అకాడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ టివి రాఘవాచార్యులు, డీన్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్ లత, సిడిఓఇ డైరెక్టర్ ప్రొఫెసర్ సి రంగనాథన్, జాయింట్ డైరెక్టర్ డాక్టరు భరత్ భూషణ్, ఓఎస్‌డి హరినారాయణ, సిడిఓఇ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అందుబాటులో ఉంటాం..

ప్రజలకు సచివాలయ కన్వీనర్ల రక్షణ

ప్రజాశక్తి -కోట : ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని తాము అందుబాటులో ఉంటామని ప్రజలకు సచివాలన కన్వీనర్లు పేర్కొన్నారు. మిచౌంగ్ ప్రభావం వల్ల కాలనీని సందర్శించిన సచివాలయ కన్వీనర్లు శ్రీరామ్ గురుస్వామి, చిట్టోడు మాజీ సొసైటీ చైర్మన్ ఉలవకాయల ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయ అధికారులు సోమవారం వైస్సార్ నక్కల, దక్కల కాలనీలో మిచౌంగ్ తుఫాన్ సందర్భంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి వారికి మనోధైర్యం కల్పించారు. టైమ్ టేబుల్ ప్రకారం 12వ తేదీ ఇవ్వాల్సిన రేషన్ సరుకులను వారి దయనీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మంగళవారం ఇప్పించేలా అధికారులతో మాట్లాడి ఒప్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, సచివాలయ కన్వీనర్లు శ్రీరామ్ గురుస్వామి, ఉలవకాయల ప్రసాద్, సచివాలయ సిబ్బంది, విఆర్ఓ భక్తవత్సలరెడ్డి, పంచాయతీ సెక్రటరీలు లోహిత్ కుమార్, సురేష్, ఏఎన్ఎమ్ మణెమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, ఎనిమల్ హస్బెండ్రి అసిస్టెంట్ సుకన్య, మహిళా పోలీస్ షర్మిల పాల్గొన్నారు.

అంధకారంలో గూడూరు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గూడూరు పట్టణము, గూడూరు మండల పరిధిలోనీ గ్రామాల్లో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో అంధకారంలోకి వెళ్లి పోయాయి. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వేముల పాలెం వద్ద చెరువు కలుజు నీరు ఉదతంగా ప్రవహించడంతో పలు గ్రామాలైన విందురు, విందూరు పల్లి , సంత దాసు పల్లి, పగడాల పల్లి , కండ్రిగ, మిట్టత్మ కూరు తదితర గ్రామాలకు రాక పొకలు బంద్ అయ్యాయి. రూరల్ ఎస్. ఐ మనోజ్ కుమార్ ఎప్పటికప్పుడు తన సిబ్బందితో కలిసి పర్యవే క్షి స్తున్నారు.



రాజును పరామర్శిస్తున్న హర్షిత్ రెడ్డి

రాజుకి మెరుగైన వైద్యమందించాలి: హర్షిత్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి మండల పరిధిలోని కల్ రోడ్డుపల్లి పంచాయతీ ఆముదాల కోనకు చెందిన రాజుపై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా శస్త్ర చికిత్సలు చేసి ఐసీయూలో వైద్యం అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి సోమవారం ఆసుపత్రికి వెళ్లి గాయపడ్డ రాజును పరామర్శించారు. కుటుంబ సభ్యులకు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ధైర్యం చెప్పి ఓదార్చారు.



డాక్టరేట్‌ను అందుకుంటున్న సునీల్‌కుమార్

కోట సునీల్ కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త , సాయి సత్సంగ నిలయం నిర్వాహకులు, ప్రముఖ ఆడిట ర్ కోట సునీల్ కుమార్ చెన్నై నగరంలోని సోషల్ క్లబ్‌లో ది అమెరి కన్ యునివర్సిటీ యుఎస్ఏ, గ్లోబల్ పీస్ సమ్మెట్ అధ్వర్యం లో డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ది అమెరికన్ యునివర్సిటీ డాక్టరేట్ ను ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో 2019 గోవాలో గ్లోబల్ పీస్ సమ్మెట్ ఆధ్వర్యం లో అవార్డ్ అందుకున్నారన్నారు. తాను ఈ స్థాయిలో ఉండ డానికి తన తల్లి దండ్రులు కారణమని, వారికి జీవితాంతం రుణపడి ఉంటా నన్నారు. అనంతరం శ్రేయోభి లాషులకు, మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

వసతి కేంద్రాలకు మత్స్యకారులు

ప్రజాశక్తి - తడ : పంచాయతీ పరిధిలోఉన్న ఎస్టీ కాలనీవాసులను, వరదయ్యపాలెం మత్స్యకారులను మండల కన్వీనర్ కె.ఆర్ముగం ఆధ్వర్యంలో తడ జడ్‌పి హైస్కూల్లో ఏర్పాటుచేసిన వసతి కేంద్రాలకు తరలించారు. లోతట్టు ప్రాంతాలైన కాదలూరు, మాంబట్టు, అక్కంపేట, కారూరు, పూడి, తడకండ్రిగ, అండ గుండాల తదితర గ్రామాలు జలమయమయ్యాయి. కాదలూరు, మాంబట్టు, కట్టవ గ్రామాలకు వెళ్లే రోడ్డు కాళంగి కాల్వ పొంగిపొర్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాదలూరు స్కూల్లో వసతి కేంద్రానికి పంచాయతీ కార్యదర్శి ఎల్.శేషారావు వర్షబాధితులను తరలిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఆదివారం నుంచి విద్యుత్ లేకపోవడంతో చీకట్లోనే అవస్థలు పడుతున్నారు.

దెబ్బతిన్న గృహాల పరిశీలన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రామకష్ణాపురం సర్పంచి విరిత సదాశివపురం కాలనీలో వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సాయం అందించాలని విఆర్ఓను కోరారు. గొల్లపల్లి చెరువు కట్టమీద గుడిసెల్లో నివాసం ఉంటున్న కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించారు. ఉప సర్పంచి పద్మ, పంచాయతీ కార్యదర్శి నరేష్‌కుమార్, విఆర్ఒ ఫిరోజ్ పాల్గొన్నారు.వేపగుంట, నేసానూరు, తోరూరు గ్రామాల్లో వరి, వేరుశనగ, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ అధికారి కోదండయ్య తెలిపారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొండచుట్టు మండపం సమీపంలో వరద నీరు నిలిచిపోవడంతో వార్డు కౌన్సిలర్ జి.జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో తొలగించారు.

సహాయక చర్యల్లో సర్పంచ్ నగేశం

ప్రజాశక్తి - రేణిగుంట : మిచాంగ్ తుపాన్ సహాయక చర్యల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్ నగేశం సైనికుడిలా సేవలందిం చారు. తుఫాన్ ప్రభావం వలన గత మూడు రోజులుగా రేణిగుంట పంచాయతీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయి. తుపానును సైతం లెక్కచేయకుండా ప్రజల మధ్యనే ఉంటూ లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ వరద నీరు మళ్లించేందుకు తగు చర్యలు తీసుకున్నారు. వార్డు మెంబర్ ఈశ్వరమ్మ. ఉప్పు రమణ పాల్గొన్నారు.



రేణిగుంటలో

భారీ వర్షానికి నేలకూలిన పూరిళ్లు

ప్రజాశక్తి -వరదయ్యపాళెం : మండలంలోని మరదవాడ గ్రామంలో పేద రైతు కూలీలు కారణి వసంతమ్మ, మునస్వామికి చెందిన పూరిళ్ళు సోమవారం ఉదయం నేల కూలాయి. గోడలు ఒక్కసారిగా నేలకు ఒరగడంతో దిక్కుతోచని స్థితిలో అధికారుల సాయం కోసం ఆ కుటుంబం ఎదురుచూస్తోంది.

300 మందికి భోజనం ఏర్పాటు



ప్రజాశక్తి -కోట : టిడిపి అధినేత ఆదేశాల మేరకు తుపాను సహాయ చర్యల్లో భాగంగా నార్త్ గిరిజన కాలనీ వాసులకు 300 మందికి భోజనాన్ని అందించారు. అధికారుల ద్వారా ఏమైనా సహాయ చర్యలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. తుపాను ప్రభావం తగ్గేవరకూ తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మైనార్టీ సెల్ అధ్యక్షులు జలీల్ అహ్మద్, ఎంపిటిసిలు షేక్ షంషుద్దీన్, దారా సురేష్ పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు

- స్తంభించిన రవాణా మార్గాలు
- ప్రమాదపు అంచుల్లో చెరువులు
- తుపాన్ తో అధిక వర్షపాతం
- ఈదురు గాలులు..విద్యుత్ అంతరాయం
- పోలీస్, రెవెన్యూ, అధికారుల పహారా
- వైద్య ఆరోగ్యశాఖ పిహెచ్‌సి, విహెచ్‌సి లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి- దొరవారిసత్రం : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ లోని దొరవారిసత్రం మండలంలో మిచౌంగ్ ప్రభావం అధికంగా కనిపిస్తోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలో ప్రవహించే కాళంగినది నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కుతోంది. తనియాలి గ్రామ సమీపంలోని ఎత్తు తక్కువ ఉన్న వంతెనపై నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహించడంతో ఆ గ్రామాల వైపు రాకపోకలు ఆగిపోయాయి. వెదురుపట్టు, పూల తోట, గ్రామాల వైపు వెళ్లే రోడ్లపై అత్యధికంగా నీటి ప్రవాహం ఉండడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిల్లో ప్రమాద హెచ్చరికలు దాటి అత్యధిక నీరు ఉండడంతో ఏ వాహనదారులు వారి గ్రామాలకు చేరుకోలేక పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వెదర్ రిపోర్ట్ గ్రామంతో పాటు, పలు గ్రామాల్లో ఉన్న పూరి ఇల్లు గోడల కూలి ఆ కుటుంబీకులు నిరాశ్రయులయ్యారు. ఉదయం నుండే మండల పరిధిలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడం, చెట్లు కూలి తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి తాగునీటి సరఫరా లేక వర్షపు నీటితో వంటకు, తాగడానికి ఉపయోగించుకోవాల్సి వస్తోంది. గోపీనాథ్ రెడ్డి, ఎస్సై తిరుమలరావు, ఎంపీడీవో సింగయ్య, నాయుడుపేట సీఐ సోమయ్య తుపాను ప్రభావిత ప్రాంతాలను, ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తూ ప్రాణ నష్టం జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నీటి చెరువులకు సామర్థ్యాన్ని మించి





అత్యధిక అన్నిటి ప్రవాహం చేరడంతో చెరువు కట్టలకు గండి పడుతాయోమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలతో అనారోగ్యానికి గురైన వారికి వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్యశాఖ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని 24 గంటలు అందుబాటులో ఉంటూ, సచివాలయ పరిధిలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ లలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మండల ప్రాథమిక వైద్యాధికారి వి. చైతన్య తన పరిధిలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ లలో అందిస్తున్న ఆరోగ్య సేవలు గురించి పర్యవేక్షిస్తున్నారు. అంతే కాకుండా ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భవతులను ముందు జాగ్రత్త చర్యలుగా ఏఎన్ఎంల ద్వారా 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఎస్సై తిరుమల రావు తన సిబ్బందితో ప్రతి గ్రామంలోని పరిస్థితిని పరిశీలిస్తూ, ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నారు. తుపాను ప్రభావం అత్యధికంగా ఉండడంతో మండలంలోని గ్రామాల్లో ఎటు చూసినా వర్షపు నీరు చెరువులను తలపిస్తున్నాయి.

నీట మునిగిన 800 ఎకరాల వరి

ప్రజాశక్తి - నాయుడుపేట : మండలంలోని నరసారెడ్డి కండ్రిగ, తుమ్మూరు, విన్నమాల, పుదురు, పూడేరు గ్రామాలలో 800 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.ప్రసాద్‌రావు సోమవారం పరిశీలించారు. మండలం లో మొత్తం 1675హెక్టర్లు లో వరి పంట ఇప్పటివరకు సాగు చేసి వున్నారు. అదేవిదంగా 32 హెక్టారులలో నారు మడులు ఉన్నాయి. వీటిలో 375 హెక్టర్లు వరి పంట ప్రస్తుతం నీట మునిగి వుంది. ఇదే విదంగా వర్షం పడితే ఇంకా ఎక్కువ విస్తీర్ణం లో పంట నీట మునిగే అవకాశం ఉందని అంచనా వేశారు. జిల్లా వ్యవసాయాధికారి వెంట డీ ఏ ఓ, ఆఫీస్ ఏడిఏ ధనంజయ రెడ్డి, నాయుడుపేట ఏ ఓ జోగి గణేష్ పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగ : నాలుగు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే చెరువులు నిండాయి. ఆదివారం రాత్రి నుంచి గాలులతో కూడిన వర్షం కురవడంతో కొత్తకండ్రిగ, గాజులపెళ్లూరు, కంచనపుత్తూరు చెరువులు ప్రమాదకరస్థాయికి చేరుకున్నాయి. కొత్తకండ్రిగ చెరువుకు గండిపడే పరిస్థితి రావడంతో ఇరిగేషన్ అధికారులు కట్ట చివరి భాగాన కట్టను తెగ్గొట్టి నీటిని బయటకు పంపారు. పార్లపల్లి గ్రామంలో పాఠశాలలో ఉన్న పెద్ద చెట్టు సమీపంలో ఉన్న ఇంటి మీద పడటంతో రూ. 2లక్షల ఆస్తి నష్టం వాటిలినట్లు బాధితుడు తెలిపారు. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కాళంగి యేరు నుంచి వరద ప్రవాహం రావడంతో చిన్నాయ్యగుంట గ్రామంలో ఇళ్లలోకి నీరు చేరింది. తుపాను తీవ్రతకు ప్రజలు ఎవరూ బయటకు రావద్దని తహశీల్దార్ భార్గవి తెలిపారు.